ఈనాడు సిద్దిపేట

ఆదివారం సెప్టెంబరు 29, 2024

లోక్ అదాలత్‌లో 5,328 కేసుల పరిష్కారం



పరిష్కార పత్రాలు అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: క్షణికావేశంలో చేసిన తప్పులను, పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లు దోహదం చేస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్‌లో 5,240 క్రిమినల్, 61 సివిల్ కేసులు పరిష్కరించామని, 27 మోటారు ప్రమాద కేసుల్లో బాధితులకు రూ. 2.52 కోట్ల పరిహారం ఇప్పించామన్నారు. వీటితో పాటు 69718 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించామన్నారు. దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ పరిధిలో 10 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి మిలింద్‌కాంబ్లే, జూనియర్ సివిల్ జడ్జి చందన, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రావణీయాదవ్, ద్వితీయ శ్రేణి జ్యూడిషయల్ న్యాయమూర్తి కాంతారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, పీపీ జీవన్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మీ గుండె చప్పుడు.. వినండి!

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం



అందరికీ హాయ్..

నేను మీ గుండెను..

నేను లబ్‌డబ్ అనే వరకు నీ ఊపిరి నిలుస్తుంది. శరీరంలో కీలకంగా పని చేస్తూ నిన్ను నడిపించేది నేనే. నా స్వరం వందేళ్ల దాకా, మధ్యలోనే ఆగిపోవాలా అనేది.. నీ అలవాట్లపై ఆధారపడి ఉంది సుమా..! పొగ, మద్యం, కొవ్వు పదార్థాల వంటివి రుచించవు. అయినా వినకుండా కొందరు వాటినే ఇష్టంగా తీసుకుంటూ నన్ను బాధపెడుతున్నారు. నాలో నాలుగు గదులకు రక్తం, ఆక్సిజన్ అందక అలసిపోయి ఆగిపోతున్నా. ఆరోగ్యానికి హాని చేసే అలవాట్లను మార్చుకుంటే పదిలంగా ఉంటాను. నేడు గుండె దినోత్సవం సందర్భంగా నువ్వేమి చేయాలో చెప్పడానికి వచ్చా..

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఇటీవల పాతికేళ్లు కూడా నిండని యువత గుండెపోటుతో మరణించిన ఘటనలున్నాయి. తాజాగా పదో తరగతి విద్యార్థి ఇదే రీతిలో ప్రాణం కోల్పోయాడు. దీనికి ఒక్కటే కారణం జంక్‌ఫుడ్‌కు అలవాటు పడటమే. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో శుచి, శుభ్రత లేని ఆహారం తింటున్నారు. కొవ్వు, నూనె ఎక్కువగా వాడుతున్నవి ఇష్టానుసారంగా తింటుండటం నాకు చేటు చేస్తోంది. వైద్యులు. అలాంటివి తినొద్దని చెబుతున్నా మీరు వినట్లేదు. ఒకప్పుడు ఎక్కడో ఓ చోట కనిపించే ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు.. ఇప్పుడు అడుగడుగున కనిపిస్తున్నాయి. మారుమూల గ్రామాలకూ పాకింది. నాలుగు జిల్లాల్లో వెయ్యికి పైగా ఉన్నట్లు అంచనా.

కల్తీతో మరింత ప్రమాదం



ఇటీవల కాలంలో అన్నీ కల్తీ అవుతున్నాయి. నూనె విషయంలో ఇది మరింత ఎక్కువగా ఉంది. వికారాబాద్ జిల్లా మర్పల్లి, తాండూరు వంటి ప్రాంతాల్లో అల్లం, వెల్లుల్లి పేస్టును కల్తీ చేస్తున్నారు. ఇక నాలుగు జిల్లాల్లో కల్తీ నూనె, నెయ్యిని యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. వీటిని వాడుతూ నన్ను బాధిస్తున్నారు.

జిల్లాల్లో గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు ● సంగారెడ్డి 22 ● మెదక్ 48 ● సిద్దిపేట 72 ● వికారాబాద్ 42

నూనె తగ్గించుకోవాల్సిందే..



నూనె విషయంలో జాగ్రత్తలు పాటించడం ప్రధానం. ప్రస్తుతం వేరుశెనగలు, ఇతరత్రా వాటి ధరలు అధికంగా ఉన్నాయి. నూనె తక్కువ ధరకు అమ్ముతున్నారంటే కాస్త ఆలోచించాల్సిందే. నిత్యం 20 గ్రాములు మాత్రమే వాడాలని నిపుణులు సూచిస్తున్నారు. నెలకు అర లీటరు మించి వాడరాదు. గ్రామాల్లో ఇప్పటికీ వందేళ్లు దాటిన వారున్నారు. వారు నన్ను ఎంత బాగా చూసుకుంటున్నారో అర్థం చేసుకోండి.

అత్యవసరంలో సీపీఆర్ ఇలా..



గుండె కొట్టుకోవడం ఆగితే వెంటనే సీపీఆర్ చేసి కాపాడుకోవచ్చు. గుండెకు పంపింగ్ చేస్తూ అదే సమయంలో ఊపిరితిత్తులు ఒదిమితే ఆక్సిజన్ తీసుకునేలా చేయాలి. సీపీఆర్ చేస్తున్నప్పుడు రోగి నోటి ద్వారా గాలి అందించాలి. ఇలే చేస్తే గుండెపోటు వచ్చిన బాధితులను ఆదుకునేందుకు వీలుంటుంది. ఇటీవల నాలుగు జిల్లాల్లో వైద్యశాఖ ఆధ్వర్యంలో దీనిపై అవగాహన కల్పిస్తున్నారు.

– న్యూస్‌టుడే, సిద్దిపేట, సంగారెడ్డి అర్బన్, మెదక్, వికారాబాద్ కలెక్టరేట్

జాప్యం చేయొద్దు..


నాలుగు జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసరంలో గుండె జబ్బు కల్గిన వారికి ఉచితంగా ఈసీజీ, టూడీకో వంటి పరీక్షలు చేస్తారు. ప్రాణాపాయం నుంచి తప్పించేలా ఓ టీకాను (ఓ దశ వరకు) అందుబాటులోకి తీసుకొచ్చారు. నాలుగు గంటల్లోపు ఆస్పత్రికి తరలిస్తే టెనిక్టప్లేస్ 40ఎంజీ టీకా ఇస్తారు. గుండెలో ఉన్న గడ్డను టీకా కరిగించి ప్రాణాపాయం నుంచి తప్పిస్తుంది.

జాగ్రత్తలు తప్పనిసరి



ఒకప్పుడు 60 ఏళ్లకు పైబడిన వారు రక్తపోటు, మధుమేహం, గుండె వ్యాధులతో బాధపడేవారు. ఇప్పుడు 30 ఏళ్లకే వాటి బారినపడుతున్నారు. జీవనశైలిలో మార్పు, ఆహార అలవాట్లు ప్రభావం చూపుతున్నాయి. 6 నెలలకోసారి పరీక్షలు చేయించుకోవాలి. సమతుల ఆహారం తీసుకోవాలి. సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి. – డా. అనిల్ కుమార్, కార్డియాలజిస్ట్, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో వివిధ వర్గాలకు చెందిన 200 మందితో 'న్యూస్‌టుడే' బృందం సర్వే నిర్వహించగా వెల్లడైన అంశాలు..



ప్రశ్న	అవును / ఉంది	లేదు
వ్యాయామం చేస్తున్నారా?	51	149
సమయానికి నిద్ర పోతున్నారా?	90	110
బయటకు వెళ్లినప్పుడు జంక్‌ఫుడ్, ఇతర ఆహారం తీసుకుంటున్నారా?	87	113
మీ ఇంట్లో వంటనూనె వాడకంపై అవగాహన ఉందా?	123	77

43 మినీ ట్యాంకులు శుభ్రం

న్యూస్‌టుడే, చేర్యాల: మంచి నీటి ట్యాంకులు శుభ్రం చేసేందుకు బల్దియా యంత్రాంగం కదిలింది. 'ఈ నీరు తాగేదెలా..?' అనే శీర్షికతో శనివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పుర కమిషనర్ ఎన్. నాగేందర్ స్పందించారు. పట్టణంలోని అన్ని ట్యాంకులను శుభ్రం చేయాలని వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్‌ను ఆదేశించారు. దీంతో ఆయన సిబ్బందితో కలిసి పట్టణ పరిధిలోని 43 ట్యాంకులను శనివారం శుభ్రం చేయించారు. బ్లీచింగ్ చల్లారు. శివారు కాలనీల్లోని మరో మూడు ట్యాంకులను ఆదివారం శుభ్రం చేయిస్తామని కమిషనర్ తెలిపారు.

టీజీవో జిల్లా కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేటలోని జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన టీజీవో (ఆఫీస్ బేరర్ల) ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా పి.శ్రీరాంరెడ్డి, కార్యదర్శిగా చెన్ను శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడిగా కొండల్‌రెడ్డి, కోశాధికారిగా నరసింహ, ఉపాధ్యక్షులుగా సురేశ్, సుజాత, జయశ్రీ, సంయుక్త కార్యదర్శులుగా రాధిక, ఖాజా, సువర్ణదేవి, కార్యాలయ కార్యదర్శిగా పి.అయోధ్యరెడ్డి, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా నర్సింలు ఎన్నికయ్యారు. రాష్ట్ర టాక్స్ ఆఫీసర్ (జీఎస్టీ) శ్యాం, రంగారెడ్డి టీజీవో అధ్యక్షుడు రామారావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా సౌందర్య

సిద్దిపేట టౌన్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దుబ్బాక బాలికల ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సౌందర్య నియామకం అయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆమెకు నియామక పత్రం అందజేశారు.

కలెక్టరేట్ వద్ద నిరసన

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: తాత్కాలిక, పొరుగు సేవల పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శనివారం నిరసన చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు ఎల్లయ్య, కార్యదర్శి గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు ప్రాంతానికి తపాసుపల్లి జలాలు



తపాసుపల్లి రిజర్వాయరు వద్ద కాంగ్రెస్ శ్రేణులతో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

చేర్యాల, న్యూస్‌టుడే: దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన తపాసుపల్లి రిజర్వాయరు నుంచి ఆలేరు ప్రాంతానికి గోదావరి జలాల తరలింపును ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శనివారం ప్రారంభించారు. ఈ మేరకు రిజర్వాయరు కుడి కాలువ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కరవు పీడిత ప్రాంతానికి తపాసుపల్లి కల్పతరువుగా మారిందన్నారు. సాగునీటిని చేర్యాల, ఆలేరు ప్రాంతాల వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీటి విడుదల సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేపట్టారు.

నాయకత్వ లక్షణాల పెంపునకే నోబ్యాగ్ డే

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: పిల్లల మధ్య సమన్వయం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికే నోబ్యాగ్ డే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్ అన్నారు. కొండపాక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి వ్యక్తిత్వ వికాస నిపుణులు మామిడాల శ్రీనివాస్‌తో కలిసి హాజరై మాట్లాడారు. నోబ్యాగ్ డే కార్యక్రమంతో సృజనాత్మక, ఆలోచనాత్మక, విమర్శనాత్మక, బృంద చర్చలతో జ్ఞాన సముపార్జన చేసుకుంటారన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవుల పాత్రను పోషించి ప్రదర్శించిన భువన విజయం నాటిక ఆకట్టుకుంది. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, విఠల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులు తప్పనిసరి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: గుండెపోటు మరణాలను అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డా. నారాయణరావు సూచించారు. ఆహారంగా తృణధాన్యాలు, పీచు పదార్థాలతో కూడిన వాటినే ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని సిద్దిపేటలోని నాసర్‌పురా, అంబేడ్కర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అధికారులు, సిబ్బందికి రక్తపోటు, చక్కెరవ్యాధి, రక్తంలో కొవ్వుశాతం పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. శ్రీకళ, వైద్యాధికారి సాయికిరణ్, రాజేందర్, వెంకటరమణ, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

పల్లె పోరు.. తుది జాబితా ఖరారు

● జిల్లాలో 6.14 లక్షల ఓటర్లు



న్యూస్‌టుడే, సిద్దిపేట: గ్రామ పంచాయతీ ఎన్నికల కసరత్తులో ముఖ్య ఘట్టం ఆవిష్కృతమైంది. జిల్లాలోని పంచాయతీల వద్ద ఓటర్ల తుది జాబితాను శనివారం ప్రదర్శించారు. గతంలో శాసనసభ స్థానాల వారీగా విడుదల చేసిన తుది జాబితా ప్రకారం.. పంచాయతీ ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. మరోవైపు బీసీ గణన పూర్తయిన తరువాతే పల్లె పోరు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. జిల్లాలో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. తుది జాబితా ప్రకారం.. గ్రామాల్లో 6 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే 9722 మంది మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు.

తుది జాబితా ప్రకారం..

పంచాయతీలు	491
వార్డులు	4350
మొత్తం ఓటర్లు	6,14,371
పురుషులు	3,02,321
మహిళలు	3,12,043
ఇతరులు	7

ఆ గ్రామాల్లో సందిగ్ధం

జిల్లాలో మొత్తం 23 గ్రామ పంచాయతీలకు (216 వార్డులు) సంబంధించి ముసాయిదా జాబితా వెలువడలేదు. సాంకేతిక కారణాలతో సిద్దిపేట గ్రామీణ మండలంలో 15 గ్రామాలకు సంబంధించి ఓటర్ల జాబితా ప్రదర్శితం కావడం లేదు. దీంతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయలేదు. ముంపునకు గురైన 8 గ్రామాల జాబితాపై స్పష్టత కొరవడింది. మరోవైపు తుది జాబితా కూడా విడుదల కావడంతో తమ పరిస్థితి ఏమిటనే ఆవేదన ఆయా గ్రామాల ప్రజలు, రాజకీయ నేతల్లో వ్యక్తమవుతోంది.

బరిలో నిలవాలని..

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచిగా నిలబడి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో గట్టి పోటీ ఉండే అవకాశం ఉంటుందని రాజకీయవేత్తలు భావిస్తున్నారు. గతంలో బరిలో నిలిచి ఓడిన వారు, కొత్తగా రంగంలోకి దిగాలని మరి కొందరు ఉవ్విళ్లూరుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు రంగం సిద్ధం చేశారు.

మారథాన్‌లో మహిళల మెరుపులు

న్యూస్‌టుడే, సిద్దిపేట, హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం, గజ్వేల్ గ్రామీణం:



హుస్నాబాద్‌లో పరుగులో పాల్గొన్న మహిళలు

మారథాన్ పోటీలపై మహిళలు ఆసక్తి చూపుతున్నారు. 5, 10 కిలోమీటర్లే కాదు ఏకంగా 21 కిలోమీటర్లు(హాఫ్ మారథాన్) అలవోకగా పరిగెత్తుతున్నారు. అందులోనూ 40 ఏళ్లకు పైబడిన వారే ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. ఇటీవలి వివిధ చోట్ల నిర్వహించిన పోటీల్లో సత్తా చాటారు.

పరుగుల రాణి ప్రత్యూష



హుస్నాబాద్‌కు చెందిన కొలుగూరి ప్రత్యూష పరుగులో ప్రతిభ కనబరుస్తున్నారు. భర్త సత్యనారాయణరెడ్డి వ్యాయామ సంచాలకులుగా పని చేస్తున్నారు. రోజూ ఉదయం లేదా సాయంత్రం భర్తతో కలిసి కొంత దూరం పరిగెత్తుతున్నారు. అలా పరుగుల రాణిగా పేరు తెచ్చుకున్నారు. అలా హుస్నాబాద్, సిద్దిపేటలో జరిగిన పోటీలో భర్తతో కలిసి పాల్గొన్నారు. 21 కి.మీ పరుగు 2 సార్లు, 2 సార్లు, 10కి.మీ. ఒకసారి, 5 కి.మీ ఒకసారి పరిగెత్తారు. ప్రతిభ చూపి పతకాలు అందుకున్నారు. మొదట్లో కష్టమనిపించినా తర్వాత అలవాటైందన్నారు.

భర్త ప్రోత్సాహంతో లలిత ముందడుగు



హుస్నాబాద్‌కు చెందిన బూట్ల లలిత గృహిణి. భర్త రాజమల్లయ్య ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. వయస్సు 45 ఏళ్లకు పైగా ఉంటుంది. భర్త ప్రోత్సాహంతో పరుగుపై ఆసక్తి పెంచుకున్నారు. మొదటిసారి హుస్నాబాద్‌లో నాలుగేళ్ల క్రితం నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో పాల్గొన్నారు. అప్పటి నుంచి హైదరాబాద్, సిద్దిపేట, కరీంనగర్, హుస్నాబాద్‌లో జరిగిన ఏడు మారథాన్‌లలో భర్తతో కలిసి పాల్గొన్నారు. పలు పతకాలు అందుకున్నారు. మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండటానికి ఇలాంటివి ఎంతో దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు.

పదేళ్లుగా రాణిస్తున్న సుజాత



సిద్దిపేటకు చెందిన వ్యాయామ సంచాలకురాలు సుజాత. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్నారు. విద్యార్థినులను ఆటల్లో మెరికల్లా తీర్చిదిద్దుతూ రన్నర్‌గా ప్రత్యేకత చాటుతున్నారు. ఇప్పటి వరకు హాఫ్‌మారథాన్ 15 మార్లు, మారథాన్‌లో ఒకసారి పాల్గొన్నారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన పోటీల్లో 10 కి.మీ. విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. నిత్యం ఆరోగ్యంగా ఉండటానికి ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని, విద్యార్థులను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెబుతున్నారు సుజాత.

ప్రాజెక్టు పనులకు నిధులు కేటాయించండి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, న్యూస్‌టుడే: నిలిచిపోయిన గౌరవెల్లి రిజర్వాయరు, కాల్వల నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి విన్నవించారు. ఈ మేరకు ఆయన శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. ప్రాజెక్టు సమస్యలపై వివరించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఖాళీలు భర్తీ చేస్తే పట్టభద్రులకు ఉపాధి



నరేందర్‌రెడ్డి

హుస్నాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హుస్నాబాద్‌లోని ఓ వేడుక మందిరంలో కరీంనగర్, మెదక్, అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నియోజకవర్గ శాసనమండలి పట్టభద్రుల ఓటర్ల నమోదుపై అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న ఖాళీలను భర్తీ చేస్తే చాలా మంది పట్టభద్రులకు ఉపాధి లభిస్తుందన్నారు. రాబోయే శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో పోటీ చేయడానికి నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అభ్యర్థిత్వం ఆశిస్తున్నానని, పార్టీకి దృష్టికి సైతం తీసుకెళ్లానని పేర్కొన్నారు.


నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

సిద్దిపేట అర్బన్: లైన్ల మరమ్మతుల్లో భాగంగా పట్టణంలోని ముర్షద్‌గడ్డ, కాంచిట్ చౌరస్తా, సాయిబాబా ఆలయం, గణేశ్‌నగర్ కాలనీల్లో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఎం.ఎ.కరీం

పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించండి

పరిగి, న్యూస్‌టుడే: పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ చూపాలని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ సైకలాజిస్టు డాక్టర్ ఎం.ఎ.కరీం అన్నారు. శనివారం పరిగిలో మైండ్ పవర్‌పై 'విద్యార్థులు- మానసిక సమస్యలు' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను ర్యాంకుల కోసం ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. పిల్లల స్థాయిని గమనించాలని సూచించారు. విద్యార్థులకు శారీరక శ్రమ అందించే ఆటపాటలు నేర్పించాలని, అప్పుడే ఫోన్లకు దూరంగా ఉంటారని తెలిపారు. అనంతరం జ్ఞాపక పోటీ పరీక్షలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. మెజీషియన్ రామకృష్ణ ప్రదర్శించిన మ్యాజిక్ షో ఆకట్టుకుంది.

పౌష్టికాహారం అందించేలా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, చిన్నకోడూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు పౌష్టికాహారం అందించేలా సభ్యులు, అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం సిద్దిపేట కలెక్టరేట్‌లో జాతీయ ఆహార భద్రత చట్టం-2013 జిల్లాలో అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు ఆహారభద్రత కార్డుల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన బియ్యం అందించాలన్నారు. రక్తం తక్కువగా ఉన్న పిల్లలను బలవర్ధకమైన ఆహారం అందించాలన్నారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. బడుల్లో మెనూ ప్రకారం ఆహారం అందించేలా పర్యవేక్షిస్తామన్నారు. అంతకుముందు సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి కస్తూర్బా, సాంఘిక సంక్షేమ గురుకులం, చిన్నకోడూరు ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో జయదేవ్ ఆర్య, డీఎస్‌వో తనూజ, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఎంఈవో యాదవరెడ్డి, చిన్నకోడూరు సీడీపీవో శారద తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు షురూ

వరంగల్ క్రీడావిభాగం: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రస్థాయి పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. వరంగల్ శివారులోని మొగిలిచర్ల మైదానంలో అండర్-19 క్రికెట్ పోటీలను కుడా (కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ) ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి ప్రారంభించారు. పూల్ 'ఏ'లో వరంగల్, మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్, పూల్ 'బీ'లో ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల జట్లు ఆడుతున్నాయి. ఈ నెల 30 వరకు పూల్ ఏ, అక్టోబరు 1 నుంచి 3 వరకు పూల్ బీ జట్లు లీగ్, నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఆడనున్నాయి. అక్టోబరు 4, 5 తేదీల్లో సెమీస్, ఫైనల్స్ ఉంటాయి. ● కోమటిపల్లి క్రికెట్ మైదానంలో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు 21.2 ఓవర్లలో 53 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నల్గొండ జట్టు 13.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 55 పరుగులతో గెలిచింది.

ఆహార జాగ్రత్తలతో గుండె పదిలం: ఎస్పీ



బెలూన్లను వదులుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఆహార జాగ్రత్తలు, వ్యాయామంతో గుండె పదిలంగా ఉంటుందని ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. అధిక వేపుడు పదార్థాలు, బయటి చిరుతిళ్లకు దూరంగా ఉండాలని సూచించారు. సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. డీఎస్పీ సత్తయ్యగౌడ్, ఏఆర్ డీఎస్పీ నరేందర్, పట్టణ గ్రామీణ సీఐలు భాస్కర్, బాలాజీ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ శ్రీధర్, శైలజ, ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సందడి..

మెతుకుసీమ మణిహారం.. మంజీరా నాదం

న్యూస్‌టుడే, సిద్దిపేట

మంజీరా నది పరవళ్లలో పులకించిన పుడమి తల్లిలో పురుడుపోసుకున్న సాహిత్య, సాంస్కృతిక చేతనమే మంజీరా రచయితల సంఘం (మరసం). ఉమ్మడి మెదక్ జిల్లాలో 1986' జులై 20న ఆవిర్భవించింది. నదీ ప్రవాహం మాదిరి ప్రజా జీవితంతో మమేకమైన ఈ సాహితీవృక్షం 38వ పండగకు సిద్ధమైంది. సాంఘిక సమకాలీన అంశాలకు దర్పణం పట్టి.. ప్రగతిశీల సాహిత్యాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా మెతుకు సీమను మురిపించిన ఈ సంఘం సిద్దిపేటలో ఆదివారం వార్షికోత్సవం జరుపుకోనున్న వేళ కథనం.



ద్వితీయ వార్షికోత్సవంలో పాల్గొన్న కాళోజీ



ర్యాలీలో సంఘం సభ్యులు

ఉమ్మడి జిల్లాలో ఏకైక నది మంజీర. ప్రవహించే నది నాగరికతకు దర్పణం. ఈ స్ఫూర్తితో మరసం పేరు ఖరారు చేశారు. నది మాదిరి సాహిత్యం పరవళ్లు తొక్కించేలా కవులు, రచయితలు కృషి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 50 మంది కవులు, రచయితలు ఇందులో సభ్యులుగా ఉన్నారు. కష్టజీవికి ఇరువైపులా ఉన్నవాడే కవి అనేది మహాకవి శ్రీశ్రీ మాట. వారి స్ఫూర్తిగా.. మరసం మెతుకుసీమలో అంతర్భాగమైంది. ఇందులో యువ కవులను భాగస్వాములను చేస్తున్నారు.

నెలకోసారి సమావేశం

ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు డా. నందిని సిధారెడ్డి సంస్థకు రూపకల్పన చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా వ్యవహరించారు. మరసం 60 వరకు పుస్తకాలు వెలువరించింది. కవితలు, కథలు, పాటలు, వ్యాసాల సంకలనాలు, సంపుటిలుగా పుస్తకాలు వెలువరించడంతో పాటు కవులతో ముఖాముఖి వంటి వాటితో ప్రత్యేకత చాటుతున్నారు. సమాజ క్షేమాన్ని కాంక్షిస్తూ గొల్లసుద్దులు, వీధి నాటకాలు, ఇతర రూపాల్లో ప్రదర్శించారు. స్థానిక భాషను కవిత్వం, పాటలు, నాటకం, కథల ప్రక్రియల్లో నిక్షిప్తం చేస్తున్నారు. నెలకోమారు సమావేశం నిర్వహిస్తూ చైతన్య గళాన్ని వినిపిస్తున్నారు.

చైతన్య కార్యక్రమాలు..

● వివాహ వ్యవస్థలో మార్పు తేవాలని వరకట్న రహిత వివాహాలు చేపట్టారు. సభావివాహాలు జరిపించారు. ● తెలంగాణ భాష, యాసకు పెద్దపీట వేస్తున్నారు. నందిని సిధారెడ్డి రచించిందే నాగేటి సాల్లల్ల నా తెలంగాణ.. పాట. కవి గాయకుడు దేశపతి శ్రీనివాస్ రాసిన పాటలు ప్రజల మనసును దోచాయి.
● సిద్దిపేటలో నిర్వహించిన తెలంగాణ చైతన్య వేదిక ఆవిర్భావ సభలు ఉద్యమానికి ఊపు తెచ్చాయి.
● సాహిత్యంలో ప్రతిభావంతులకు పురస్కారాలు అందిస్తున్నారు.
● వరకట్నం, మద్యపాన వ్యతిరేక ప్రదర్శనలు సహా రైతుల ఆత్మహత్యల నివారణకు ర్యాలీలు నిర్వహించారు. ● పదేళ్ల మహాసభల సమయంలో ప్రత్యేక సంచికను రూపొందించారు. మంజీర పేరిట త్రైమాసిక సాహిత్య సంచిక వెలువరించారు.



కవితాసంపుటి ఆవిష్కరణలో సినారె

నిత్య నూతనంగా..

తెలంగాణ అస్తిత్వ మాండలికాన్ని సాహిత్యంలో ప్రవేశపెడుతున్నారు. జనరంజకమైన భాషను వచనంలో వ్యక్తీకరించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. కొవిడ్ లాంటి పరిస్థితుల్లో మంజీర రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో కార్యక్రమాలు చేపట్టారు. 2019 అక్టోబరు 7న 'మరసం మంజీర' పేరిట యూట్యూబ్ ఛానెల్‌ను ఆరంభించారు. ప్రసంగాలు, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలను అప్‌లోడ్ చేస్తున్నారు. బ్లాగ్‌స్పాట్, ఫేస్‌బుక్, ట్విటర్ ఖాతాలూ ఉన్నాయి.

జీవద్భాషను వ్యక్తీకరించి..

ప్రస్తుతం సంఘ అధ్యక్షుడిగా కె. రంగాచారి, ప్రధాన కార్యదర్శిగా డా. సిద్దెంకి యాదగిరి, సభ్యులు, ప్రముఖ కవులు, సాహితీవేత్తలు డా. నందిని సిధారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, కె. అంజయ్య, కందుకూరి శ్రీరాములు, అలాజిపూర్ కిషన్, తైదల అంజయ్య, రాజిరెడ్డి, పొన్నాల బాలయ్య, గంభీరావుపేట యాదగిరి తదితరులు సంఘ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ ప్రాంత భాషను సాహిత్యంలో జొప్పించి.. జీవద్భాషను వ్యక్తీకరిస్తున్నారు. తెలంగాణ పలుకుబడుల భాషను రచనల్లో ప్రస్ఫుటిస్తున్నారు.

నిరంతర కార్యాచరణతో..:

మరసం ఉమ్మడి జిల్లా వేదికగా ఆవిర్భవించినా తెలుగు రాష్ట్రాల్లో పేరెన్నికగన్న సాహితీ సంస్థగా ఎదిగింది. నిరంతర కార్యాచరణతో సాధ్యమైంది. ప్రజా సమస్యలే ఎజెండాగా సాహిత్యాన్ని సృష్టించడం ప్రత్యేకం. మరసం ప్రేరణతో చాలా మంది కవులు వచన కవిత్వంలో పుస్తకాలు వెలువరించారు. సామాజిక మార్పు కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించింది. నేటి సభకు సాహితీవేత్తలు, సాహితీప్రియులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలి.

కె.రంగాచారి, మరసం అధ్యక్షుడు

రైతును బలిగొన్న విద్యుత్తు తీగ



యాదగిరి

దుబ్బాక, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తిలో చోటుచేసుకుంది. భూంపల్లి ఎస్సై వి.హరీశ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కమటం యాదగిరి (42) వ్యవసాయం చేస్తూ భార్యాపిల్లలతో జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం ఉదయం ఊరి శివారులో ఉన్న పొలంలో బోరు మోటారు మరమ్మతులు చేయడానికి ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఈ క్రమంలోనే పొలం సమీపంలో ఉన్న నియంత్రిక వద్ద విద్యుత్తు సరఫరా నిలిపివేసే క్రమంలో జంపర్ రాడ్ పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. యాదగిరి తిరిగి రాకపోయే సరికి ఆయన తండ్రి లక్ష్మినారాయణ పొలానికి వెళ్లగా నియంత్రిక వద్ద విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి బోరున విలపించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

తూప్రాన్, న్యూస్‌టుడే: తూప్రాన్‌లోని ఓ మద్యం దుకాణం సమీపంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు.. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌కు చెందిన అంసానిపల్లి శ్రీనివాస రెడ్డి(50) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. పట్టణంలోని పెట్రోల్ బంకు వద్ద ఉన్న లిక్కర్ మార్ట్ సమీపంలో శుక్రవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొడుకు వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	125-00	డ్రెస్డ్	213-00
రిటైల్	147-00	స్కిన్‌లెస్	243-00

హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

మనోహరాబాద్, న్యూస్‌టుడే: అందరికీ సమాన హక్కులు ఉన్నాయని, వాటికి ఎవరైనా భంగం కలిగిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. మనోహరాబాద్ మండలం గౌతోజీగూడలో ఈ నెల 10న డప్పు కొట్టలేదని ఓ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేయగా, 31 మందిపై అట్రాసిటీ కేసు నమోదైన విషయం విదితమే. ఈ మేరకు శనివారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి విచారణ చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన చంద్రం, అర్జున్‌లు డప్పు కొట్టలేదని బహిష్కరించడం దారుణమన్నారు. గ్రామస్థులంతా కలిసి ఉండాల్సింది పోయి ఇలాంటి దారుణ ఘటనలకు పాల్పడటం ఏంటని ప్రశ్నించారు. బాధ్యులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డిని ఆదేశించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణానికి పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. బాధిత కుటుంబీకులు మాకు రక్షణ కల్పించాలని కోరారు. తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు లక్ష్మినారాయణ, రాంబాబు, శంకర్, ప్రవీణ్, తహసీల్దారు చంద్రశేఖర్, సీఐ రంగకృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్ఐ సుభాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గౌతోజీగూడలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బక్కి వెంకటయ్య

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని చిన్నారి లభ్యం



చేగుంట, న్యూస్‌టుడే: చేగుంట మండలం వడియారం రైల్వేస్టేషన్‌లో రెండేళ్ల వయసున్న గుర్తుతెలియని చిన్నారి దొరికినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 26న ఉదయం చిన్నారి రైల్వేస్టేషన్‌లో ఏడుస్తుండగా ప్రయాణికులు గమనించి స్టేషన్‌మాస్టర్‌కు చెప్పినట్లు తెలిపారు. స్టేషన్‌మాస్టర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చిన్నారిని తీసుకొని స్టేషన్‌కు వచ్చినట్లు చెప్పారు. రెండు రోజుల పాటు చూసినా ఎవరూ రాకపోవటంతో మెదక్ జిల్లా బాలల సంరక్షణ అధికారికి అప్పగించినట్లు తెలిపారు. చిన్నారికి సంబంధించిన వారు ఉంటే చేగుంట పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

భార్యపై భర్త కత్తితో దాడి

కొడంగల్: భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన వికారాబాద్ జిల్లా రుద్రారంలో చోటు చేసుకుంది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన విజయలక్ష్మి, శాంతప్ప దంపతులు. వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి జరిగిన గొడవలో శాంతయ్య భార్య విజయలక్ష్మిపై కత్తితో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. శనివారం కేసు నమోదు చేసి భర్తను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ఏటీఎం కార్డు అపహరించి డబ్బు డ్రా

రామాయంపేట: ఓ వ్యక్తికి మాయమాటలు చెప్పి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎం కార్డు అపహరించి.. నగదు విత్‌డ్రా చేసిన ఘటన రామాయంపేటలో శనివారం వెలుగు చూసింది. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని కాట్రియాలకు చెందిన రాజయ్య రామాయంపేట ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బు తీసుకునేందుకు ఈనెల 25న వచ్చాడు. అప్పుడే ఏటీఎంలోకి వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు రాజయ్యను మాటల్లో పెట్టి ఆయన కార్డు తీసుకొని వేరేది ఇచ్చారు. డబ్బు రాకపోవడంతో రాజయ్య ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి రెండు విడతలుగా రూ.71వేలు డ్రా అయినట్లు ఆయనకు సమాచారం వచ్చింది. రాజయ్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

క్రీడలతో మానసికోల్లాసం

● రాజన్న సర్కిల్ సీసీఎఫ్ శరవణన్



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సీసీఎఫ్ శరవణన్ తదితరులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: క్రీడలు మానసికోల్లాసానికి, శరీర దారుఢ్యానికి దోహదం చేస్తాయని రాజన్న సర్కిల్ అటవీశాఖ ముఖ్య అధికారి శరవణన్ పేర్కొన్నారు. జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో రాజన్నసర్కిల్ రెండవ జోనల్ క్రీడోత్సవాలు శనివారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాజ్యోతి వెలిగించారు. అనంతరం మాట్లాడుతూ.. ముఖ్యంగా ఒత్తిడిలో ఉద్యోగాలు చేసే వారికి క్రీడలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. సిద్దిపేట, మెదక్, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి జిల్లాలకు చెందిన సుమారు 200 వందల మంది ఉద్యోగులు క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. మొదటిరోజు వాలీబాల్, కబడ్డీ, షటిల్స్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. పీఈటీలు రామేశ్వర్‌రెడ్డి, సుజాత, వెంకటస్వామి గౌడ్, ఉప్పలయ్య, కనకారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజ్‌మోహన్‌గౌడ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల అటవీశాఖ అధికారులు శ్రీనివాస్, బాలమణి, నిఖిత, జోజి, ఇక్రమొద్దీన్, సందీప్‌కుమార్, పద్మారెడ్డి, పద్మ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం అందిస్తూ.. సేదతీరుస్తూ..

ఆ అతిథిగృహం లోపలికి అడుగు పెట్టగానే ఏపుగా పెరిగిన వృక్షాలు స్వాగతం పలుకుతాయి. పచ్చదనం కనువిందు చేస్తుంది. జహీరాబాద్‌లో 65వ నంబరు జాతీయ రహదారికి పక్కన దశాబ్దాల క్రితం నిర్మించిన ర.భ. అతిథిగృహం విశేషాలివి. మూడు దశాబ్దాల కిందట నిర్మించింది కాగా, విశాలమైన ఆవరణలో మొక్కలు నాటగా అవిప్పుడు పెరిగి వృక్షాలుగా మారాయి. అధికారులు వాటి చుట్టూ కూర్చునేందుకు వీలుగా అరుగులు మాదిరిగా నిర్మించారు. దీనికి సమీపంలో పోలీసు స్టేషన్, బస్టాండు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఉన్నాయి. వివిధ పనుల నిమిత్తం ఆయా చోట్లకు వస్తున్న వారితో పాటు పట్టణవాసులు ఈ చెట్ల కిందే సేద తీరుతుంటారు.

- న్యూస్‌టుడే, జహీరాబాద్



మైనం చుక్క.. ఎంచక్కా

న్యూస్‌టుడే, జిన్నారం: బాతిక్.. ఇండోనేషియా, శ్రీలంక, మలేసియాలో పేరున్న కళ. దీన్ని మైనం చుక్కగా పేర్కొంటారు. పగుళ్లగా కళారూపం ఉండి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ కళ కోల్‌కతాకు తొలిసారిగా రాగా రాష్ట్రానికి చెందిన కాపు రాజయ్య, యాసాల బాలయ్య వంటి వారు నేర్చుకున్నారు. బాలయ్య బాతిక్ కళానైపుణ్యంతో బాతిక్ బాలయ్య, బాతిక్ పికాసోగా పేరుగాంచారు. ఆయన కుమారుడు యాసాల ప్రకాశ్ ప్రస్తుతం ఇదే తరహాలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ కాపాడుతుండటం విశేషం.

సంగారెడ్డి జిల్లా జిన్నారం గిరిజన గురుకుల ఉపాధ్యాయుడైన ప్రకాశ్.. బోధనతో పాటు తాను గీసిన చిత్రాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలపై ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రంలో ఒకే ఒక్క బాతిక్ కళాకారుడిగా గుర్తింపు పొందారు. ప్రకాశ్ బాతిక్ చిత్రాలకు మంచి గుర్తింపు ఉంది.



మాజీ గవర్నర్ తమిళిసైకి వస్త్రంపై చిత్రాన్ని చూపుతూ..

ప్రభుత్వ కార్యక్రమాలకు, విదేశీ ప్రతినిధులు వచ్చినప్పుడు ఈయన చిత్రాలను జ్ఞాపికలుగా ఇస్తున్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో అదానీ గ్రూప్ ఛైర్మన్‌కు ఇచ్చిన జ్ఞాపిక ప్రకాశ్‌దే కావడం విశేషం. మాజీ సీఎం కేసీఆర్ సైతం మెచ్చుకున్నారు.

సంప్రదాయ రూపాలు..

బతుకమ్మ, బోనాలు, కొమ్ముకోయ, గుస్సాడి, పేరిణి నృత్యం, ఖవ్వాలి వంటి వాటికి తన చిత్రాల్లో ప్రత్యేక స్థానం కల్పిస్తారు. అదే సమయంలో యువతను ఆకట్టుకునేలా నేటి ఫ్యాషన్‌కు తగ్గట్టుగా కొన్ని కళారూపాలు తయారు చేస్తున్నారు. ప్రకాశ్ సతీమణి మమత బోరబండలో పలువురు మహిళలతో కలిసి యూనిట్ నిర్వహిస్తున్నారు. దీనిద్వారా గోల్కొండ హ్యాండీ క్రాఫ్ట్ ఎంపోరియమ్, ఆంధ్రప్రదేశ్‌లోని లేపాక్షికి పంపిస్తున్నారు.

ఇలా చేస్తారు..

తెల్ల, పసుపు పచ్చ మైనం కలిపితే ఓ ద్రావణం వస్తుంది. దీన్ని ప్రత్యేక బాతిక్ కలంతో కాటన్ వస్త్రంపై డిజైన్ వేస్తారు. అది ఎప్పటికీ చెరిగిపోదు. ఒక వస్త్రాన్ని ఒక్కసారి మాత్రమే వినియోగిస్తారు. 'ఇప్పటివరకు వేలాది కళారూపాలు వేయగా.. కొన్నింటిని ప్రభుత్వం విదేశీయులకు జ్ఞాపికలుగా ఇవ్వడం సంతోషంగా ఉందని, ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుందని, నేటి యువత కళను నేర్చుకునేందుకు ముందుకు రావాల'ని కోరుతున్నారు ప్రకాశ్.



బాతిక్ కళారూపం

దృష్టిసారిస్తే.. లాభాల పయనం

న్యూస్‌టుడే, పరిగి, మోమిన్‌పేట: పొదుపు సంఘం సభ్యులకు ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం పలు రకాలుగా కృషి చేస్తోంది. ఇందుకు వివిధ పథకాలను అమలు చేస్తోంది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలంలో నాలుగేళ్ల క్రితం సన్న, చిన్నకారు మహిళా సభ్యులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కేంద్రాన్ని నెలకొల్పారు. మండలంలో 921 సంఘాలు ఉండగా, 9217 మంది సభ్యులుగా ఉన్నారు. వీటిలో అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కేంద్రంలో 91 సంఘాలకు చెందిన 1347 మంది సభ్యులుగా చేరారు. ప్రారంభించిన సమయంలో సభ్యులతో ప్రయోగాత్మకంగా పరిసర గ్రామాల్లో పండించిన కూరగాయలను కొనుగోలు చేశారు. ఒప్పందం కుదుర్చుకున్న బెనెషా కంపెనీకి విక్రయించారు. మొత్తం 1182.25 మెట్రిక్ టన్నుల అమ్మకంతో రూ. లక్షల్లో ఆదాయం వచ్చింది. దీంతో సంఘాల బలోపేతానికి మార్గం ఏర్పడింది.



నిరుపయోగంగా పరికరాలు

రవాణా ఛార్జీలతో..

కేంద్రం ఏర్పాటు మండలంలో కూరగాయల సాగు విస్తీర్ణమూ పెరిగింది. రెండేళ్ల పాటు లాభాలు ఆర్జించగా, ఆ తర్వాత రవాణా ఛార్జీల భారంతో విక్రయాలు తగ్గాయి. మరోవైపు సదరు కంపెనీ నిర్వాహకులు బహిరంగ మార్కెట్ ధరకు కొనకపోవడం, అధికారుల నిర్లక్ష్యంతో నష్టాలే మిగిలాయి. కంపెనీ వారు సకాలంలో డబ్బు చెల్లించకపోవడంతో విక్రయాలకు ప్రధాన అవరోధంగా మారింది. ప్రస్తుతం నిరుపయోగంగా మారింది.



అనంతగిరి రైతు ఉత్పత్తిదారుల కేంద్రం

ఆశించిన ధర రాక..: శ్రీనివాస్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్

బహిరంగ విపణి ధర లభించక కూరగాయల విక్రయానికి రైతులు ముందుకు రాలేదు. దీంతో ఏడాదిన్నరగా కార్యకలాపాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం కందులు, మినుములు, పెసర, మొక్కజొన్న కొనుగోళ్లకు కార్యాచరణ రూపొందించాం. 458 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేసి నాఫెడ్‌కు విక్రయించాం. తద్వారా రూ.3.4లక్షల లాభం చేకూరింది.

ఉత్తమ సేవలకు గుర్తింపు


ఎల్లప్పకు అవార్డు ఇస్తున్న మేనేజర్ జనార్దన్

దుబ్బాక, మిరుదొడ్డి: దుబ్బాక 108 విభాగంలో పనిచేస్తున్న న్యాలపల్లి ఎల్లప్ప అత్యవసర సేవల విభాగంలో మెరుగైన వైద్య సేవలు అందించినందుకుగాను జిల్లా స్థాయిలో స్టార్ ఈఎంటీ అవార్డును శనివారం దుబ్బాకలో అందుకున్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు శనివారం జిల్లా సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడిషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, నర్సాపూర్, రంగధాంపల్లి చౌరస్తాలు, మెదక్ రోడ్, వేములవాడ కమాన్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తనిఖీలు నిర్వహించగా 27 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రూ.9,200 జరిమానా విధించారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

● అవస్థల నడుమ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ


రాఘవాపూర్‌లో కేంద్రం

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ, సిద్దిపేట అర్బన్: మాతాశిశు సంరక్షణలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆరేళ్లలోపు బాలలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో ప్రస్తుతం సగానికి పైగా కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండడంతో చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొంత భవనాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నా.. స్థల సమస్య, నిధుల కొరతతో అనుమతులు లభించడం లేదు. విధిలేని పరిస్థితుల్లో ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉన్న చిన్న భవనాలు, ఇరుకు గదుల్లోనే సిబ్బంది కేంద్రాలను కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై కథనం..

కనీస వసతులు కరవు

జిల్లాలో 1,150 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు కలిపి 77,786 మందికి సేవలు అందుతున్నాయి. చాలా కేంద్రాల్లో ఇరుకు గదులకు తోడు సరైన గాలి, వెలుతురు ఉండడం లేదు. పెద్ద మొత్తంలో అద్దె చెల్లిస్తున్నా.. తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేక చిన్నారులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. చాలా చోట్ల ఒక్క గదితోనే నెట్టుకొస్తున్నారు. క్రీడా ప్రాంగణాలు లేకపోవడంతో చిన్నారులు ఆటలకు దూరమవుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం:

పలు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. ముందుగా అసంపూర్తిగా ఉండి, మరమ్మతులు చేపట్టాల్సిన వాటిపై దృష్టిసారించాం. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం.

– శారద, జిల్లా శిశుసంక్షేమ శాఖ అధికారిణి

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు
ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 5
అంగన్‌వాడీ కేంద్రాలు: 1,150
సొంత భవనాల్లో ఉన్నవి: 455
అద్దె భవనాలు: 298
ఉచిత భవనాలు: 397
ఆరేళ్లలోపు పిల్లలు: 65,698
గర్భిణులు: 6,506
బాలింతలు: 5,582

వంతెన నిర్మించి.. వరద కష్టాలు తీర్చరూ!


వాగులో నిరసన తెలుపుతున్న భారాస నాయకులు

హుస్నాబాద్ గ్రామీణం: హుస్నాబాద్ మండలం కూచనపల్లిలోని వాగుపై వంతెన నిర్మించాలని భారాస నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్‌రెడ్డి కోరారు. శనివారం వాగు వద్ద రైతులతో కలిసి నిరసన తెలిపారు. తాళ్లచెరువు నుంచి వచ్చే వరదనీరు ఈ వాగు ద్వారా ప్రవహిస్తుందన్నారు. గ్రామానికి చెందిన రైతుల పొలాలన్నీ వాగుకు అవతలి వైపు ఉన్నాయన్నారు. వాగు పొంగితే వ్యవసాయ బావులు, పొలాలకు వెళ్లలేరన్నారు. నాయకులు ఐలేని గాల్‌రెడ్డి, గూళ్ల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

చరవాణుల అప్పగింత

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేటలో చరవాణులు పోగొట్టుకున్న పలువురు బాధితులకు సీఈఐఆర్ సాంకేతికతతో వాటిని స్వాధీనం చేసుకొని పోలీసులు అప్పగించారు. పట్టణానికి చెందిన ఎండీ సోహెల్, షకీల్, నెవెల్‌కుమార్, ప్రసాద్‌గౌడ్, రహీం అనే వ్యక్తులు గత కొన్నిరోజుల కిందట చరవాణులు పోగొట్టుకున్నారు. ఈ క్రమంలో సిద్దిపేట వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ సాంకేతికత ద్వారా ఆచూకీ కనుగొన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై నరసింహారావు శనివారం బాధితులకు అప్పగించారు.

ప్రతి ఒక్కరూ పర్యావరణ హితానికి పాటుపడాలి


మొక్కలు నాటుతున్న పారిశుద్ధ్య పర్యవేక్షకురాలు వనిత, సిబ్బంది

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ప్రతీ ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 15వ వార్డులోని ఇస్లామియా కళాశాల సమీపంలో పిచ్చి మొక్కలు తొలగించారు. బారా ఇమాంలోని చెరువులో పూడికను తొలగించారు. అనంతరం పట్టణంలోని మైదానంలో వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది జట్ల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించారు. బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సరదాగా కాసేపు క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ములుగు, న్యూస్‌టుడే: ములుగు అటవీ కళాశాల పరిశోధన కేంద్రంలో విద్యార్థులు వ్యర్థాలతో పలు రకాల నమూనాలు తయారు చేశారు.

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లోని పురపాలిక డీఆర్‌సీసీ సెంటర్‌లో తడి చెత్తతో ఎరువును తయారు చేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శనివారం స్థానిక డీఆర్‌సీసీ సెంటర్‌లో నవభారత్ పాఠశాల విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. పురాధ్యక్షురాలు ఆకుల రజిత మాట్లాడుతూ.. పురపాలికలో సేకరించిన చెత్త విభజన, ప్రాసెసింగ్ చేసే విధానాలను వివరించారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలి: వంటేరు


బేస్‌బాల్ క్రీడాకారులతో ప్రతాప్‌రెడ్డి, నిమ్మ రంగారెడ్డి తదితరులు

వర్గల్, న్యూస్‌టుడే: బేస్‌బాల్ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మ రంగారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వర్గల్ మండలం వేలూరులో రాష్ట్ర అసోసియేషన్ తరఫున పాల్గొనే క్రీడాకారుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శ్వేత, కృష్ణ, మధు యాదవ్, ప్రవీణ్ గౌడ్, పాపిరెడ్డి, వెంకటేశ్వర్ గౌడ్ తదితరులున్నారు.

ఉపాధి పనుల తనిఖీ.. రూ.1.06 లక్షల జరిమానా


ప్రజావేదికలో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

బెజ్జంకి, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం అమలులో భాగంగా సామాజిక తనిఖీలో పలు లోపాలు బహిర్గతమయ్యాయి. శనివారం బెజ్జంకిలోని రైతువేదికలో జరిగిన ప్రజావేదికకు అదనపు డీఆర్డీవో బాలక్రిష్ణ, ఏపీడీ శివాజీ, అధికారులు హాజరయ్యారు. మండల వ్యాప్తంగా 23 పంచాయతీలు ఉండగా.. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ.3.43 కోట్లతో ఉపాధిహామీ కింద కూలీలతో వివిధ రకాల పనులు చేపట్టారు. సామాజిక తనిఖీ బృందం కొద్ది రోజులుగా గ్రామాల్లో ఆయా పనులు పరిశీలించగా ప్రజావేదికలో ఒక్కో గ్రామం వారీగా తనిఖీల వివరాలు వెల్లడించారు. చేపట్టిన పనులు, చెల్లింపుల్లో వ్యత్యాసాలు కన్పించాయి. మొత్తంగా సిబ్బందికి రూ.1.06లక్షల జరిమానా విధించిన అధికారులు.. మరో రూ.30వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో ప్రవీణ్, ఇన్‌ఛార్జి ఏపీవో రాజబాబు, ఎస్సార్పీ స్వామి, హరీఫ్, సంతోష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన శాస్త్ర నమూనాల ప్రదర్శన


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థికి బహుమతి అందిస్తున్న జడ్పీ సీఈవో రమేశ్, డీపీవో దేవకిదేవి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని టీటీసీ భవన్‌లో జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి రోజైన శనివారం సైన్స్ మేళాను జడ్పీ సీఈవో రమేశ్, డీపీవో దేవకిదేవి ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 20 పాఠశాలల విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యావర్థిని పాఠశాలకు చెందిన ఎన్.కీర్తన, ఇందిరానగర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఈ.ఝాన్సీ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవగా రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వారికి ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడల మేనేజర్ వెంకటేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ఆవరణలో శ్రమదానం

సిద్దిపేట టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఆవరణలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారిణి కెప్టెన్ భవాని ఆధ్వర్యంలో సుమారు 50 మంది కేడెట్లు మైదానంలో పిచ్చిమొక్కలను తొలగించారు. పారిశుద్ధ్య పర్యవేక్షకురాలు వనిత ఆధ్వర్యంలో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం


హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న జడ్జి శివరంజని

దుబ్బాక, న్యూస్‌టుడే: న్యాయస్థానం పరిధిలో ఉన్న అనేక కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ ఎంతగానో దోహదపడుతుందని దుబ్బాక జూనియర్ సివిల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముగంటి తరణి తెలిపారు. శనివారం దుబ్బాక న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుబ్బాక సర్కిల్, తొగుట పరిధిలో మొత్తంగా 690 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. దుబ్బాక, భూంపల్లి, మిరుదొడ్డి, తొగుట ఎస్సైలు గంగరాజు, హరీశ్, పర్శరాములు, రవికాంత్ రావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

హుస్నాబాద్: చిన్న చిన్న తప్పులతో గొడవలు పడి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని హుస్నాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శివరంజని అన్నారు. శనివారం హుస్నాబాద్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రిన్సిపల్ కోర్టులో 428 కేసులు, అదనపు కోర్టులో 273 కేసులు కలిపి మొత్తం 701 కేసులు పరిష్కారమయ్యాయి. అదనపు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి కృష్ణతేజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళిమోహన్, పీపీ నాగరాజు, ఏజీపీ సదానందం, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ గ్రామీణ: జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ జూనియర్ సివిల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సౌమ్య, అదనపు న్యాయమూర్తి ప్రియాంకలు సూచించారు. ఈ మేరకు గజ్వేల్ కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 1406 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయసుధ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాండరీ, జిల్లా బాలల సంక్షేమసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'పెంపుడు జంతువులతో అప్రమత్తం'

సిద్దిపేట, న్యూస్‌టుడే: ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా సిద్దిపేటలోని ప్రాంతీయ పశువైద్యశాలలో పెంపుడు శునకాలకు రేబిస్ టీకాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.జగత్‌కుమార్‌రెడ్డి హాజరై ప్రారంభించి మాట్లాడారు. పెంపుడు జంతువులతో అప్రమత్తంగా ఉండాల్సిన తీరు, రేబిస్ వ్యాధి కారణాలు, వ్యాప్తి, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. సహాయ సంచాలకుడు డా. సత్యప్రసాద్‌రెడ్డి, డా.విజయసారథి, రాము, రాజు, సిబ్బంది ఉన్నారు.

జిల్లా వెటర్నరీ నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా వెటర్నరీ అసోసియేషన్ కార్యవర్గాన్ని సిద్దిపేటలో శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శ్రీకాంత్, అసోసియేట్ అధ్యక్షుడిగా యాదగిరి, కార్యదర్శిగా సయ్యద్ పాషా, కోశాధికారిగా సతీశ్, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రంరెడ్డి, రాష్ట్ర వెటర్నరీ సంఘం అధ్యక్షుడు సురేశ్, కార్యదర్శి అభిషేక్‌రెడ్డి తదితరులు హాజరై అభినందించారు.

చంద్లాపూర్‌లో యూనియన్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు

చిన్నకోడూరు, న్యూస్‌టుడే: చిన్నకోడూరు మండలంలోని చంద్లాపూర్‌లో త్వరలోనే యూనియన్ బ్యాంకును ప్రారంభించి సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలో బ్యాంకు ఏర్పాటు చేయాలని గతంలోనే స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన బ్యాంకు ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపారు. దీంతో ఎన్నో ఏళ్ల కల నెరవేరుతోంది. ప్రస్తుతం గ్రామపంచాయతీ భవనంలో ఏర్పాటుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలోనే సేవలు అందుబాటులోకి రానుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు ఏర్పాటుకు కృషి చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు జడ్పీ మాజీ అధ్యక్షురాలు రోజాశర్మ, భారాస రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సందడిగా ముందస్తు బతుకమ్మ సంబురాలు


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ వేడుకలు అలరించాయి. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బతుకమ్మ వేడుకల విశిష్టతను వివరించారు. బతుకమ్మ ఆటపాటలతో విద్యార్థులు, ఉపాధ్యాయినులు అలరించారు. పాఠశాల ఛైర్మన్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న బక్కి వెంకటయ్య, తదితరులు

దుబ్బాక, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపోటములు సహజమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం దుబ్బాక పురపాలిక లోని లచ్చపేట ఆదర్శ పాఠశాలలో రెండు రోజులుగా కొనసాగుతున్న ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలకు కేఆర్‌ఆర్ ఫౌండేషన్ అధినేత కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డితో కలిసి ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో ప్రభుదాస్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ బుచ్చిబాబు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నీటిశుద్ధి యంత్రం ప్రారంభం

హుస్నాబాద్: పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల కల్పనకు అందరు సహకారం అందించాలని పురాధ్యక్షురాలు ఆకుల రజిత కోరారు. శనివారం హుస్నాబాద్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తాగునీటి ఇబ్బందులు తొలగించడానికి స్థానిక మిత్రమండలి-87 ఆధ్వర్యంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి నీటిశుద్ధి యంత్రం ఏర్పాటు చేయించి ప్రారంభించారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

వర్గల్, న్యూస్‌టుడే: భూములు కోల్పోయిన నిర్వాసితులకు తగిన పరిహారం చెల్లించి, ఉపాధి కల్పించాలని కోరుతూ రైతులంతా కలిసి వర్గల్ తహసీల్దారు బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. వారం రోజులుగా టీజీఐఐసీ పరిశ్రమల ముందు వారు చేస్తున్న నిరసన కార్యక్రమాన్ని శనివారం గజ్వేల్ గ్రామీణ సీఐ మహేందర్ రెడ్డి, వర్గల్ తహసీల్దార్ వేర్వేరుగా పరిశీలించారు.

యువతకు భగత్‌సింగ్ స్ఫూర్తి


సిద్దిపేటలో భగత్‌సింగ్‌కు నివాళులు అర్పిస్తున్న మన్నెకుమార్ తదితరులు

సిద్దిపేట అర్బన్, బెజ్జంకి, దుబ్బాక, మిరుదొడ్డి, జగదేవపూర్, న్యూస్‌టుడే: దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ తన ప్రాణాలను త్యజించారని, నేటి యువతకు ఆయన స్ఫూర్తి అని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం(ఏఐపీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నెకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా సిద్దిపేటలో శనివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిద్దిపేట గ్రామీణ మండలం చింతమడక ఉన్నత పాఠశాలలో కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి నవీన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు నిర్వహించారు.

● బెజ్జంకి మండలకేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ ఆధ్వర్యంలో, దుబ్బాక సీఐటీయూ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ దుబ్బాక మండల కార్యదర్శి సోమారపు స్వామి ఆధ్వర్యంలో, అక్బర్‌పేట-భూంపల్లి మండలపరిధి భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జగదేవపూర్ మండలం తీగుల్‌లో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మంజుల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

30న 'మల్లన్న' హుండీ ఆదాయం లెక్కింపు

చేర్యాల, న్యూస్‌టుడే: కొమురవెల్లి మల్లికార్జుస్వామి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు ఈనెల 30న చేపట్టనున్నట్లు ఆలయ ఈవో ఆలూరు బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థిపై దాడి

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లెలగడ్డలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఓ విద్యార్థిపై సీనియర్లు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధిత విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేట మండలం కేశనాయక్‌తండాకు ఓ బాలుడు 10వ తరగతి చదువుతున్నాడు. ఆట వస్తువులు ఉండే గది తాళం చెవి అతని వద్దనే ఉంది. ఆ గదిలో ఉన్న ఫ్యాన్, ఇతర వస్తువులు పోయాయి. చోరీ ఎలా జరిగిందని ఉపాధ్యాయులు బాలుడిని ప్రశ్నించారు. ముగ్గురు ఇంటర్ విద్యార్థుల పేర్లు చెప్పాడు. దానిని మనసులో ఉంచుకుని ఆ ముగ్గురితో పాటు మరికొందరు ఈ నెల 11న అతడిపై దాడి చేయడంతో స్పృహతప్పి పడిపోయాడు. చంద్రశేఖర్ అనే ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనంపై అతన్ని హుస్నాబాద్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న బాలుడి తండ్రి హరీశ్ ఆస్పత్రికి రాగా.. రన్నింగ్ చేస్తుండగా పడిపోయాడని ఉపాధ్యాయులు బుకాయించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుంచి కరీంనగర్‌కు, తర్వాత హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు లోపల బలమైన గాయాలు తగలడం వల్లనే చాతిలో నొప్పి వచ్చిందని చెప్పారు. దీంతో అసలేం జరిగిందో చెప్పమంటూ తండ్రి బాలుడిని అడగ్గా జరిగిన విషయం చెప్పాడు. దీంతో బాలుడి తండ్రి హుస్నాబాద్ పోలీసులను ఆశ్రయించారు.